# కలాభివర్ధని

పైగ్రాం రోడ్డు చివర మేడదగ్గర యేదో ఉత్సవం. సన్నాయి మేళం అమోఘంగా వినిపిస్తోంది. ఆ ఉత్సవం చూసి ఈరోజు రాజమండ్రి వదిలేద్దాం అనుకుంటూ దగ్గరికి వెళ్ళాను.

ఊరికి పేరుపడ్డ పైడిస్వామి సన్నాయిలో నుంచి రాగసుధారసం జాలువారుతోంది.

వెనక అంబాసిడర్ కార్లో యెవరో పెద్దలు సర్దుకుంటున్నారు.

తలెత్తి చూతునుగదా పెద్ద బుట్టనిండా పూలదండలు, వెండి పన్నీరు బుడ్డీ, గంధపుగిన్నె వగైరా సత్కార సామగ్రితో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మెట్లు దిగుతూ 'రండి,రండి. మీకోసమే చూస్తున్నాను. శ్రీనాథ జయంతికి మీరు లేకుండానా అనుకుంటున్నాను. సోమశేఖరశర్మగారు కారులో వున్నారు. పదండి' అంటూ చేతిలో సామాను కారులోకి చేరేసి నన్ను దగ్గరగా లాగి ముందు నిలబడ్డారు.

ఆహూతులు, అనాహూతులు, ఊరివారు, పొరుగూరివారు, సాహిత్యాభిమానులు అంతా పోగై ఊరేగింపు రసవంతంగా కదిలింది.

కలాభివర్ధనీ పరిషత్తు తరపున శాస్త్రిగారు కొన్నాళ్ళనుంచి రాజరాజు నగరం కోటలో పాగావేసిన ఇద్దరు మహాకవుల జయంతులు జరుపుతున్నారు. ఇంతకు ముందు విశ్వనాథ, దేవులపల్లి ప్రభృతులు వచ్చి నన్నయ్యగురించే, వేటూరి, గడియారం వగైరా శ్రీనాథుని గురించీ అద్భుతంగా ప్రసంగించి వెళ్ళారు. కార్తికంలో నన్నయ్య జయంతీ, మాఘంలో శ్రీనాథునిదీ చెయ్యాలని ఏర్పాటు.

కలాభివర్ధనీ పరిషత్తు అనేది కేవలం శాస్త్రిగారి కథల పుస్తకాల అట్టలమీద మాత్రమే దర్శన మిచ్చేది. కాని భూ నభోంతరాళాల్లో ఇంకెక్కడా కనబడేదికాదు. దాని పుట్టుక కేవలం శాస్త్రిగారి తలలో మాత్రమే. దాని అధ్యక్షులూ, 'అ'టెండరూ' ఆయనే.

సభ ఇంక పదిరోజు లుండనగా ఒక ధనవంతుణ్ని పట్టుకుని వక్తకు బహుమతిగా నూటపదార్లు సంపాదించడం ఫెళ్ళుమంటూ, సభలు జరిపించడం, మర్నాడు సూర్యప్రకాశరావుగారింట వచ్చిన కవిపండితులకు భరద్వాజ విందు. ఇదీ ఆయన నిర్వహించే సభల పరిపాటి.

ఆయన చేవరూళ్ళ కర్రతో తెల్లకాగితాలమీద రూళ్ళు వెయ్యందీ కథ రాయరు. రాసింది మూడు సార్లు రాయందీ పత్రికలకు వదలరు.

ప్రతిపనీ రూళ్ళకర్రతో గీసిన రూలులా జరగాలి. సాహిత్యసభ జరపడంలో ఆయనకు మూడు రూళ్ళు వున్నాయి.

1) ఆ రోజు వక్తను సన్నాయి మేళంతో ఊరేగించి సభాస్థలికి తీసుకువెళ్ళాలి.

2) మెయిన్‌రోడ్డుమీద ఊరేగింపు వెడుతూ వుంటే అంగళ్ళలోని ప్రముఖ వర్తకులు మెట్టుదిగి కారులోని పండితుణ్ని పూలదండవేసి గౌరవించాలి. (దండల సప్లయి అంతా శాస్త్రిగారిదే అనేది బహిరంగ రహస్యం)

3) సభాప్రారంభంలో వక్తఆసీనులై ఉండగా సభలోని ప్రముఖులకు శాస్త్రిగారు తలో దండా ఇస్తే — ఒక్కొక్కరే లేచి వెళ్ళి వారి మెడలో వెయ్యాలి. వక్త స్వయంగా ఒక్కటీ తీసి పక్కన పెట్టకూడదు. శాస్త్రిగారే కొన్నితీసి మెడకు వీలు కల్పించాలి.

'ఇంత పట్టింపుగా కవిపండితులను గౌరవించడం ప్రజలకు నేర్పాలి మనం' అనేవారాయన.

ఆరోజు శ్రీనాథ జయంతి, వక్త సోమశేఖర శర్మగారు, టౌను హాలుకు పక్కవీధిలోని కాంగ్రెసు భవనంలో సభ! ఖద్దరు, కాంగ్రెసు, అంటే త్రుళ్ళిపడే శాస్త్రిగారు ఆ సభలకు మాత్రం కాంగ్రెసు భవనాన్ని ఉపయోగించడం తమాషాగా ఉండేది.

'కొదమ తుమ్మెదరెక్కల కుస్తరింపు' మీసాలతో 'డిగ్రీలులేని పాండిత్యమ్ము పస్నైకురాని పాడుకాలాన పుట్టి'నప్పటికీ గొప్ప చారిత్రకుడుగా, మంచి రచయితగా పేరుపడిన స్థితప్రజ్ఞుడు శర్మగారు. తన ఉప

న్యాసం సప్రమాణంగా, సమయోచితంగా సరసంగా వుండడానికి శర్మగారు తమ వాఙ్ముఖం వ్రాసి తెచ్చారు.

తన చరిత్రానుభవాన్ని సాహిత్య ప్రీతినీ వెల్లడిస్తూ శ్రీనాథుణ్ని గురించి మాటలాడడానికి తన అర్హత ఎంతటిదో నిరూపించుకున్నారు.

సభ రక్తిగా ముగిసింది.

శాస్త్రిగారు వక్తను యథోచితంగా పుష్ప గంధాదులతో పూజించి తాంబూలంతో ఒక కవరు వక్తచేతిలో వుంచారు.

బసలోకి వచ్చాం అందరం.

అతిథులు ఎవరి సందడిలో వారున్నారు.

ఒక రిద్దరం మాత్రం శర్మగారితో మాట్లాడుతూ దగ్గరగా వున్నాం.

శర్మగారు భోజనానికిలేస్తూ జేబులో కవరుతీసి పెట్టెలో పెట్టబోయి-అనుకోకుండానే ఒకసారి తెరిచి చూశారు.

కవరులో కరెన్సీకి బదులు కాగితం వుంది.

"అయ్యా, మన్నించండి. ఎప్పుడూ ఇట్లా జరగలేదు. అనుకున్న ప్రకారం ఇస్తానన్న దాత మాటపదార్లు ఇవ్వకుండా ఊరికి వెళ్ళాడు. నాలుగురోజుల్లో తమకు విధిగా అందజేస్తాం. తమ ఔదార్యం ఈలోపాన్ని క్షమిస్తుందని మా విశ్వాసం" క. వ.

శర్మగారు నిష్కపటంగా నవ్వుకుని – ఈ కవరు డబ్బుకన్న జాగ్రత్తగా పెట్టెలో దాచి భోజనానికి లేచారు. ధన చింతే లేని పురుషోత్తముడు ఆయన.